
# పోతనభాగవతంలో రసగుళికలు

– ఆర్.శర్మ దంతుర్తి



## 112 వ భాగం

## పురంజనోపాఖ్యానం; పృధు చరిత్ర -5

పృధు చక్రవర్తి భూమిని పిదికి ఔషధాలు బయటకి తీసి రాజ్యం సశ్యశ్యామలం చేసాక, జనాలు సంతోషంగా ఉండడం మొదలైంది కదా. ఆ తర్వాత ఒక్కొక్కటి మొదలుపెట్టి నూటికి ఒకటి తక్కువగా అశ్వమేధాలు చేసాడనీ, నూరో అశ్వమేధం చేస్తూంటే ఇంద్రుడికి కంగారు ఎక్కువైందని చదివాం క్రితం వ్యాసంలో. ఈ నూరో యజ్ఞం పూర్తి అయితే పృధువు ఇంద్రపదవికి అర్హుడు కనక ఇప్పుడు ఇంద్రుడు చేసాడో చూద్దాం.

క. అమరేంద్రుఁడు ఘనరోషో
ద్గముఁడై పాషండ వేషకలితతిరోభా
వమునం దన్మఖపశువుం
గ్రమమేది హరించి చనియె గగనంబునకున్. [4-511]

కోపంతో వచ్చి పౌషండ వేషంలో – అంటే విభూది ధరించి దేశదిమ్మరిలా కనిపించేటట్టు – ఎవరికీ కనిపించకుండా వచ్చి యజ్ఞపశువుని అపహరించి ఆకాశంలోకి ప్రయాణం అయిపోయాడు. ఈ పద్యంలో కనిపించకకుండా అనేదీ, యజ్ఞం అనేదీ పదాలు ఎక్కడున్నాయో చెప్పంది చూద్దాం? తిరోభావము – అదృశ్యరూపం. మఖము – యజ్ఞము. ఎన్ని సార్లు భాగవతం చదివినా మనకి తెలిసి వచ్చేది ఒకటే – మనకేమీ తెలియదు – అటు భగవంతుడి గురించి గానీ, ఇటు తెలుగు భాష గురించి గానీ.

క. నఘుం డగు నత్రి మహా
ముని చోదితుఁ డగుచుఁ బృథుని పుత్రుఁడు బాణా
సనతూణీర ధరుండై
యనిమిషపతి వెనుకఁ జనియె నతిదర్పమునన్. [4-513]

అక్కడ యజ్ఞం చేయించే మహర్షులలో ఉన్న అత్రి మహాముని గమనించాడు ఈ ఇంద్రుడి విషయం. పృధువు కొడుకుతో చెప్పాడు ఆ యజ్ఞపశువు సంగతి చూడమని. ఆ కుర్రాడు ఇంద్రుణ్ణి తరుముకుటూ వెళ్ళాడు. మరోసారి పద్యం చదివితే అనిమిషపతి అంటే ఇది — అనిముషులు అంటే దేవతలు — వాళ్ళకి పతి, రాజు — ఇంద్రుడు. సరే ఇంద్రుణ్ణి పట్టుకోవడానికి వెళ్ళాడు. యుద్ధం చేయడానికి బాణాలు వేయాలి కదా? కాని అటువైపు ఉన్నవాడు ఇంద్రుడు, అందులోనే పాషండ రూపంలో ఉన్నాడు. బాణం వేయొచ్చా, లేదా వేస్తే ధర్మమేనా లేకపోతే అధర్మం అవుతుందా? ఆ ధర్మ సందేహం ఎలా తీరుతుంది?

సీ. యజ్ఞ సాధన పశుహరణుని వధియించు-
ధర్మంబునందు నధర్మ మనెడి
బుద్ధిఁ బుట్టఁగఁ జేయ భూరి మాయా వేష-
ధారియై యరుగు సుత్రాముఁ గదిసి
నిలు నిలు మని యార్చి నిజగుణధ్వని చేసి-
ఘన జటాభస్మాస్థి కలిత మయిన
మూర్తిఁ గనుంగొని మూర్తీభవించిన-
ధర్మంబ కా బుద్ధిఁ దలఁచి యమర [4-515]

తే. నాయకుని మీఁద సాయక మేయఁ జాల
కున్నఁ గనుఁగొని యత్రి విద్వన్నుతుండు
వైన్యజునకనె వాసవు వలను చూపి
మనములోపల రోషంబు మల్లడింప. [4-515.1]

యజ్ఞ పశువుని తీసుకెళ్ళే ఈయన మాయా వేషంలో జటాభస్మంతో పాషండుడిలా ఉన్నాడు కనక బాణం వేయాలో కూడదో అనే చింతలో ఉండేసరికి అత్రి మహర్షి చెప్తున్నాడు. ఇందులో మరో కొన్ని తెలుగు పదాలు చూద్దాం. విద్వన్నుతుండు — విద్వాంసులచే నుతింబడే వాడు (అత్రి), వైన్యజుడు — వేనుడి సంతతి వాడు — పృధువు కొడుకు, వాసవుడు — ఇంద్రుడు, సుత్రాముడు - ఇంద్రుడు, సాయకము — బాణము. భాగవతం చదువుతుంటే అసలు మనకి తెలుగు వచ్చినట్టేనా అనే ప్రశ్న వేసుకుంటే సమాధానం మనకి అందరికీ తెల్సినదే. మరో కోణంలోంచి చూసి పోతన నిజంగా ఇంతటి తెలుగు వచ్చిన పండితుడా అని ప్రశ్నించుకుంటే దానికి సమాధానం పోతన చెప్పినదే — పలికించెడు వాడు రామభద్రుట.

క. "విను మితఁడు యజ్ఞహంతయు
నినిమిషనికరాధముండు నగు నింద్రుఁడు గా
వున నితని జయింపుము నీ"
వని మున్మా ఉచ్చరింప నవ్వైన్యజుఁడున్. [4-516]

అత్రి మహర్షి ఏమంటున్నాడంటే, చూడు నాయనా ఈయన ఇంద్రుడనేమాట నిజమే కానీ యజ్ఞపశువుని అపహరించడంతో ఆయన అనిమిషకరాధముడు — దేవతలలో నీచుడు కింద లెక్క. ఇటువంటి వారిని వదలకూడదు. అతన్ని జయించవల్సిందే. ఎందుకు దేవతలలో అధముడు అయ్యాడు ఇంద్రుడు? మానవుల అభీష్టాలు ప్రార్ధిస్తే తీర్చేవారు దేవతలు కదా కానీ ఇక్కడ పృధువు లోకకళ్యాణం కోసం యజ్ఞం చేస్తూంటే దొంగతనంగా వచ్చి యజ్ఞపశువునీ అపహరించుకుపోతున్నాడు అదీ పాషండ రూపంలో. ఆ రూపంలో వస్తే నన్నెవరూ ఏమీచేయలేరు అనుకున్నాడు కాబోలు.

మ. విను వీఢిం జను దేవవల్లభునిపై వీరుండు గ్రోధాంతరం
గ నిరూఢిన్ మృగరా ట్కిశోరము మహాగంధద్విపేంద్రంబు మీఁ
దను లంఘించు విధంబునం బడిన నాతం డశ్వ చౌర్యైక సా
ధన రూపంబుఁ దదశ్వమున్ విడిచి యంతర్ధానముం బొందినన్. [4-517]

వ. అయ్యవసరంబున నచ్చట నున్న పరమర్షిపుంగవు లతని యద్భుత కర్మంబు గనుంగొని యాశ్చర్యంబు నొంది యతనికి 'జితాశ్వుం" డను నన్వర్థ నామంబు పెట్టి యున్న సమయంబున. [4-519]

అత్రి మహర్షి ఇలా చెప్పగానే కుర్రాడికి ధైర్యం వచ్చింది. ఇంద్రుడిమీదకి (దేవ వల్లభుడు) కోపంతో వెళ్ళి సింహం పిల్ల (మృగరాట్కిశోరం – మృగరాజు, కిశోరం – పిల్ల) ఏనుగు (ద్విపేంద్రము) కుంభస్థలం మీదకి లంఘించినట్టుగా వెళ్ళేసరికి ఆ అశ్వాన్ని వదిలిపెట్టి, మాయమైపోయాడు ఇంద్రుడు. ఇది చూసిన వాళ్ళు ఆశ్చర్యంతో పృథు చక్రవర్తి కొడుక్కి ఇప్పటినుండి ఇతన్ని జితాశ్వుడు (అశ్వాన్ని జయించాడు కదా) అని పిలుద్దాం అని చెప్పారు.

చ. మఱియును దేవతాపతి తమః పటలంబు జనింపఁ జేసి యె
వ్వరుఁ దనుఁ గానకుండ ననివారణఁ గాంచనపాశ బద్ధ మై
సురుచిరయూపదారు పరిశోభితమైన హయంబుఁ గొంచుఁ జె
చ్చెర వినువీధి నేగఁగ ఋషిప్రవరుం డగు నత్రి చెప్పినన్. [4-520]

అశ్వాన్ని వెనక్కి తీసుకొచ్చాక అంతటితో అయిందా? ఆ యజ్ఞపశువుని బంగారు తాళ్లతో కట్టి ఉంచినప్పుడు మరోసారి దాన్ని ఎవరికీ కనిపించని రూపంలో అపహరించాడు ఇంద్రుడు. అత్రి మహర్షి చెప్పినట్టూ మరోసారి అనిమిషకరాధముడు – దేవతలలో నీచుడు గా నిరూపించుకున్నాడా ఇంద్రుడు లేకపోతే పృధుచక్రవర్తి పరీక్షిస్తున్నాడా అనేది మనకి తెలియదు. కానీ అత్రి మహర్షి మరోసారి హెచ్చరించాడు కుర్రాణ్ణి. హయము అంటే గుర్రం అని మనకి తెల్సినదే కదా. అశ్వమేధంలో అదే యజ్ఞపశువు. అది పోకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలో ఉండాలి.

వ. తదీయ చిహ్నంబులు పారంపర్యంబుగా ధరియింపం దొడంగిరి; తద్వృత్తాంతంబు భగవంతుం డయిన పృథుచక్రవర్తి యెఱింగి కుపితుండై యుద్యతకార్ముకుం డగుచు నింద్రుని మీఁద బాణంబుఁ నేయ నుద్యమించిన ఋత్విక్కులు శక్రవధోద్యుక్తుండు నసహ్య రంహుండు నయిన పృథు చక్రవర్తిం గనుంగొని యిట్లనిరి. [4-525]

అయితే ఇక్కడో తిరకాసు పెట్టాడు ఇంద్రుడు. జితాశ్వుడు బాణం సంధించేసరికి, తాను అపహరించిన గుర్రాన్నీ, తాను ధరించిన రూపం అక్కడవదిలేసి వెళ్ళిపోయాడు. అప్పటివరకూ ధర్మం అంటే ఇదీ, రాజు అంటే పృధువు అనుకునే జనాలకి ఈ పాషండ వేషం కొత్తగా కనిపించిందేమో ఆయనలాగా మారడం మొదలుపెట్టారు. అంటే వేద ధర్మం వదిలేసి మరోదారిలో జనం జీవితం మొదలు పెట్టారు. ఇది పృధువుకి తెల్సింది. ఇన్నాళ్ళూ తాను చేసినది జనం బాగుపడే పనులు. ఇప్పుడు ఈ కొత్త కొత్త రోగాలు అంటుకుంటే అవి బాగా వ్యాపించి చివరకి వేద ధర్మం నాశనం అవుతుంది. అందువల్ల కోపంతో ఇంద్రుణ్ణి జయించడానికి బాణం బయటకి తీసాడు.

క. జననాయక! యజ్ఞములం
దనుపమ విధిచోదితంబు లనఁదగు పశు బం
ధన హింసల కా కితరుల
ఘనదీక్షితునకు వధింపఁ గాదంద్రు బుధుల్. [4-526]

ఇలా పృధువు కోపం తెచ్చుకోవచ్చా? అసలే యాగదీక్షలో ఉన్నాడు కదా? అందువల్ల అక్కడే ఉన్న మహర్షులు చెప్తున్నారు – యజ్ఞదీక్షలో ఉన్నవాడివి ఎవర్నీ వధింపకూడదు.

క. జనపాల! వీర్యవంతము
లనఁదగు మంత్రములచేత నాహ్వానము చే
సిన నతఁ డిచటికి వచ్చును
జనుదెంచిన యమరవిభుని సరభసత దగన్. [4-528]

ఇప్పుడు ఇంద్రుడిమీదకి బాణం వేయకపోతే ఎలా అంటావేమో. మనం శక్తి కొద్దీ మంత్రాలతో ఆహ్వానిద్దాం. తప్పకుండా ఇక్కడకి వస్తాడు. వస్తాడా రాదా అనేది కాస్త చూద్దాం. పరీక్షిత్తు పాము కాటుతో చనిపోయాక ఆయన కొడుకు జనమేజయుడు సర్పయాగం మొదలుపెడతాడు. అందులో చావాల్సినది పరీక్షిత్తుని కరిచిన తక్షకుడు. కానీ ఈ మహర్షులు 'తక్షకాయస్వాహా' అని పిల్చినప్పుడు మిగతా సర్పాలు వచ్చి అగ్నిలో పడినట్టూ తక్షకుడు రాడు. ఎక్కడున్నాడా చూస్తే ఇంద్ర సింహాసనం చుట్టూ కట్టకట్టుకుని ఉంటాడు, ఇంద్రుడు తన స్నేహితుడు కనక. అప్పుడు ఈ మహర్షులు ఏమంటారంటే – 'సహేంద్ర తక్షకాయస్వాహా'. అంటే ఇంద్రుడితోపాటు నువ్వూ రా ఈ మంటల్లో పడడానికి అని. ఆ సింహాసనం, ఇంద్రుడూ, తక్షకుడు దొర్లుకుంటూ వస్తూంటే మరో మహర్షి వచ్చి యజ్ఞం ఆపుతాడు – ఇంతవరకూ చేసింది చాలు అని అందర్నీ సమాధానపరిచి. అందువల్ల మంత్రాలకున్న శక్తి అటువంటిది.

క. ధృతి చెదరఁ బట్టి శిఖి కా
హుతిఁగా వేల్చెదము; దాన నుర్వీవర! నీ
వితత మహో హత వీర్యో
న్నతుఁడై చెడిపోవు నమరనాథుం డంతన్." [4-529]

మంత్రాలతో పిల్చిన ఇంద్రుడు వస్తే ఏం చేద్దాం? అలా వచ్చిన ఇంద్రుణ్ణి అగ్నిలో ఆహుతి చేద్దాం. అలా చేస్తే పాపం అంటుకోదు, యజ్ఞం చేసి చక్రవర్తి కి దీక్ష చెడదు కూడా.

వ. అని పృథుని వారించి ఋత్విగ్గనంబులు గుపితస్వాంతులై హస్తంబుల స్రుక్స్రువంబులు ధరియించి వేల్చు సమయంబునం జతుర్ముఖుండు చనుదెంచి ఋత్విజులం గనుంగొని యిట్లనియె "యజ్ఞంబు లందు యజింపంబడు దేవత లెవ్వని యంశంబు; లెవ్వండు యజ్ఞ నామకంబగు భగవదంశంబగు, నట్టి యింద్రుండు మీచేత వధార్హుండు గాఁ డితండు భగవదంశ సంభవుం డగుట నీ యజ్ఞకర్మవిధ్వంసనేచ్ఛుం డయి కావించు ధర్మవ్యతికరంబులు చూచుచుండవలయుం గాని ప్రతీకారంబులు గర్తవ్యంబులు గా; వీ పృథుకీర్తి యగు నీ పృథునకు నేకోనశతంబగు నధ్వరప్రయోగ ఫలంబు సిద్ధించుం గాక" యని పృథు చక్రవర్తి కిట్లనియె. [4-530]

మహర్షులు చెప్పినదానికి అంగీకరించి పృధువు మళ్ళీ యాగం మొదలు పెట్టాక ఋత్విక్కులు ఇంద్రుణ్ణి పిల్చి ఆహుతి చేయడనికి సిద్ధపడ్డారు (గుపితస్వాంతులై హస్తంబుల స్రుక్స్రువంబులు ధరియించి – కోపంతో చేతిలో ఉన్న గరిటెలో నెయ్యి అగ్నిలో వేయబోయారు). అప్పుడు చతుర్ముఖుడైన బ్రహ్మ వచ్చి చెప్పాడు – యజ్ఞం చేసేది దేవతల కోసం – మన క్షేమం కోసమే కదా? అటువంటి దేవతలని భగవతాంశాలు గా భావించాలి కానీ వధించరాదు. అయితే యజ్ఞపశువుని ఎత్తుకుపోతున్నాడంటావేమో, అది భగవదేఛ్ఛ. అలాంటి ధర్మవ్యతిరేకం అయినవి దేవతలు ఏదో కారణంగానే చేస్తారు (కర్మ వల్ల కావొచ్చు, లేదా పరీక్షించడానికి). వాటిని అలా చూసి వదిలేయాలి కానీ ప్రతీకారం తలపెట్టకూడదు. అయితే నీకు ఇన్నాళ్ళు చేసిన తొంభైతొమ్మిది అశ్వమేధాలకి ఫలం సిద్ధించి తీరుతుంది. నూరోదానికి ఎందుకు కాదు అంటే బలి చక్రవర్తి కి జరిగినట్టే – ఇప్పుడో ఇంద్రుడు ఉన్నాడు కదా? అందువల్ల మరో ఇంద్రుడు తయారవడం కుదరదు.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)